క్లుప్తంగా

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీల్లో దేవేందర్‌కు స్వర్ణం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 28న కర్నూలులో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడా విభాగంలో గుంటూరుకు చెందిన ముంజుంపల్లి దేవేందర్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, టీం ఈవెంట్‌లో కాంస్య పతకాలు గెలుపొందాడని శాప్ కోచ్ కె.సంగీత్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటాడన్నారు. దేవేందర్ విద్యనభ్యసిస్తున్న ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, యాజమాన్యం అభినందనలు తెలిపారన్నారు.

వేడుకగా రుక్మిణీ కృష్ణుల కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట 2వ లైనులోని శ్రీ సిద్దేశ్వరీ పీఠపాలిత ఓంకారక్షేత్రంలో సీతారామాంజనేయ నగర సంకీర్తనా సంఘం ఆధ్వర్యంలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. ఆదివారం రుక్మిణీ సమేత కృష్ణ భగవానుడికి విశేషార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బుజ్జి బృందం నిర్వహణలో వేద మంత్రాల నడుమ రుక్మిణి కృష్ణుల విశేషాలను వివరిస్తూ కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహాహారతి, మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ముప్పు హరగోపాల్ సోదరుల భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి మద్రామాయణ ప్రవచనం భక్తులను అలరించింది. కార్యదర్శి నంబూరి శ్రీవేంకటనారాయణమూర్తి పర్యవేక్షించారు.

ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసిన జమున



లక్ష్మీపురం: సినీ నటి జమున మరణంతో ఒక నాటి మేటి తారల తరం ముగిసినట్లు అయిందని, అనేక సినిమాల్లో అపురూపమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల గుండెల్లో జమున చెరగని ముద్ర వేశారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సినీ నటి జమున సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెండితెరను ఏలిన అభినయ తార జమున చలాకీ చిన్నదిగా, సత్యభామగా అభిమానుల మనసులు దోచిన వన్నెల దొరసానిగా పేరుగాంచారన్నారు. సంస్థ సీనియర్ సభ్యులు రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, పి.ఘన శ్యామాచార్యులు, సాయిబాబు, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

రక్తదాన శిబిరం



గుంటూరు వెస్ట్: యువజన సర్వీసుల శాఖ స్టెప్, వీఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్, ఆపద్బాంధు సర్వీస్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. 80 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమ చైర్మన్ ఎస్.అయ్యప్ప మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో విలువైన ప్రాణాలు కాపాడవచ్చన్నారు. దేశంలో చాలా ప్రదేశాల్లో సరైన సమయంలో రక్తమందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాతదుస్తులు సేకరించి కావాల్సిన వారికి అందజేశారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక, ఎం.శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఆటో డ్రైవర్ దాడి

గుంటూరు ఈస్ట్: ప్రయాణికులపై ఓ ఆటో డ్రైవర్ దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 15వ లైనులో నివసించే రవి, అతని కుమారుడు ఆదివారం బస్టాండు నుంచి ఇంటికి ఆటోలో చేరుకున్నారు. ఆటో దిగి డబ్బులు ఇచ్చే క్రమంలో ఆటో డ్రైవర్‌కు, రవికి బాడుగ వ్యత్యాసం రావడంతో ఇరువురు గొడవపడ్డారు. ఆటో డ్రైవర్ రవిని అతని కుమారుడిని కొట్టి గాయపరిచాడు. ప్రయాణికుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి
- ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటితో కలిసి రూ.80లక్షలతో సీసీడ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌లు అధికారులకు సూచించారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రామనామక్షేత్రం నుంచి కేవీపీ కాలని శ్మశాన వాటిక వరకు రూ.80లక్షలతో సీసీ డ్రైన్స్, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారన్నారు. గుంటూరు నగరంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయుట జరిగిందని, సదరు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంటూరు నగరాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు దృఢసంకల్పంతో ఉన్నారని, అభివృద్ధి పనుల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు అందరం కలిసి ముందుకు వెళుతున్నామన్నారు. నగర పాలక సంస్థలో కౌన్సిల్ ఏర్పడ్డాక అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుతున్నాయన్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజాప్రతినిధులు వారి వారి డివిజన్లలోని సమస్యలను గుర్తించి, ప్రజావసరాల దృష్ట్యా సదరు పనులు నిర్వహిస్తున్నారన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ఆర్.అగ్రహారం వెంకటేశ్వరస్వామి గుడి నుంచి రామనామ క్షేత్రం వరకు మొదట ఫేజ్ కింద రోడ్డు విస్తరణ,సెంట్రల్ డివైడర్, బీటీ రోడ్డు నిర్మించడం జరిగిందని, ప్రస్తుతం 2వ ఫేజ్ కింద రూ. 80 లక్షలతో రామనామక్షేత్రం నుంచి స్మశాన వాటిక వరకు సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. ఆర్.అగ్రహారం రోడ్డు విస్తరణ, డ్రైన్లు, నూతన రోడ్ల నిర్మాణం వలన నగరంలోని 18,19,20,21,23,25 డివిజన్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆర్.అగ్రహారం వెంకటేశ్వర స్వామి గుడి నుంచి స్మశాన వాటిక వరకు రోడ్లు నిర్మించి అభివృద్ధి చేయాలనేది ఆయా డివిజన్ల ప్రజల చిరకాల వాంఛ అన్నారు. గుంటూరు నగరంలో ఇప్పటికే సుమారు రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని, వాటిలో ఇప్పటికే చాలావరకు పనులు పూర్తికావచ్చాయన్నారు. ఎమ్మెల్యే మద్దాళిగిరి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంతలూరుగా మార్చారని, అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు ఎంతో వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న రామనామక్షేత్రం రోడ్డు 5 డివిజన్లకు సంబంధించిన ప్రజలు ఎల్లప్పుడూ వాడుతుంటారని, ఈ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. అంతేకాక రోడ్డు నిర్మాణ పనులు జరుగు సమయంలో పనులలో నాణ్యత ప్రమాణాలను అధికారులు ఎల్లప్పుడూ పర్యవేక్షించాలని తెలియచేశారు. రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కాండ్రుకుంట గురవయ్య, నిమ్మల వెంకటరమణ, జిల్లా గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ బత్తుల దేవానంద్, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ అధ్యక్షుడు కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహద్దీన్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రైంతాంగ జీవనానికి దర్పణం 'నాగలికి నా నమస్కారం'



పుస్తకాన్ని ఆవిష్కరించిన భవాని దేవి, పాల్గొన్న నాగరాజ్యలక్ష్మి, తదితరులు

పాత గుంటూరు: సగటు రైతు శ్రమను, చెమట చుక్కను గౌరవించిన నాడే మట్టి బంగారం అవుతుందని, అన్నం ముద్ద ఆకలి తీరుస్తుందని తన కవిత్వం ద్వారా చాటి చెప్పిన మహనీయుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య అని రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలోని జాషువా కళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య కలం ద్వారా జాలువారిన 'నాగలికి నా నమస్కారం' పుస్తకాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ నేపథ్యమే వెంకటసుబ్బయ్య కవితా వస్తువు అన్నారు. నానీల కవిత సంపుటిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎన్‌వీ కృష్ణారావు, పత్రిక సంపాదకులు చలపాక ప్రకాష్ సమీక్షించారు. కార్యక్రమాన్ని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం సుభాని, ఎన్‌వీ సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ పలు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్లు తగదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల సందర్శన సమయంలో వెలుగు చూస్తున్న లోపాలకు కారణంగా చూపిస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పేర్కొన్నారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సంఘ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిమ్మన్న మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శించడాన్ని తాము ఆహ్వానిస్తున్నామని, వెళ్లిన ప్రతిచోట సస్పెండ్ చేయడం తగదని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ, మానసికంగా ఆందోళన చెందేవిధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో అన్ని పుస్తకాలు ఒకేసారి ఇచ్చి ఉంటే, ఈరోజు వర్క్ బుక్కులు దిద్ది ఉండేవారని, అచ్చు పుస్తకాలు ఇచ్చిన నాలుగు మాసాల తర్వాత వర్క్ పుస్తకాలు ఇవ్వడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేస్తే, సమస్య పరిష్కారం కాదని వివరించారు. గతంలో ఎంతోమంది ఐఏఎస్ అధికారులు పాఠశాలలు సందర్శించిన సమయంలో మంచి సలహాలు, సూచనలు ఇచ్చేవారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమున్నాయో ముందుగా ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకుని ఆ తరువాత చర్యలు తీసుకుంటే మాకు అభ్యంతరం లేదని, సమస్యలను పట్టించుకోకుండా కేవలం ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడమే ధ్యేయంగా ముందుకెళ్లడం తగదన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహన రావు, ప్రధాన కార్యదర్శి చందా నరసింహ రావు ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర రావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్ ఉమా, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ షేక్ బాజీ, నాయకులు కె. అనిల్‌కుమార్, వై.శ్యాంబాబు, ఖాజావలి, డీఏ జోసఫ్, ఎం. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ సీతా రామాంజనేయులు

నగరంపాలెం: బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు అన్నారు. బ్రాడీపేటలోని బ్యాంక్ కార్యాలయ ఆవరణలో ఆదివారం గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రిటైర్డు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. సీఈఓ కృష్ణవేణి, విశ్రాంత జీఎం పి.శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శులు జగన్నాధరెడ్డి, బాలాజీవరప్రసాద్, కోశాధికారి టి.నరసింహారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వి.రాధాకృష్ణమూర్తి, విజయవాడ సంఘ కార్యదర్శి రవి, సలహాదారుడైన బీవీఎస్ శర్మలు మాట్లాడారు.

అలరించిన స్వరమాధురి సంగీత విభావరి



సినీ పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరమాధురి అధ్యక్షుడు శెట్టి థామస్ ఆధ్వర్యంలో ఆదివారం అలనాటి ఆణిముత్యాలు పేరుతో సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, పి.కృష్ణారావు, శెట్టి థామస్, మిరియాల ప్రసాద రావు, చీకటి రవికాంత్, దేవదాస్, డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణ, ఘనశ్యాం, ఆదాం, హేమమాలిని, గాయత్రి సినిమా పాటలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణలను ఘనంగా సత్కరించారు.

నేడు స్పందన

నెహ్రూనగర్: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు స్పందన కార్యక్రమం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని...స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చన్నారు.

రేపు అన్న సంతర్పణ మహోత్సవం

పాత గుంటూరు: పాత గుంటూరు కట్టావారివీధిలో వేంచేసియున్న లక్ష్మీ గణపతి, శివనాగేంద్ర స్వామి, లక్ష్మీ తిరుపతమ్మ, తల్లి, గోపయ్యస్వామి వార్ల 41వ అన్న సంతర్పణ మహోత్సవ కార్యక్రమం ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లే సూర్యచంద్రరావు, ఆర్గనైజర్ ఆదూరి శ్రీనివాసరావు, ఆదివారం ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు, 6 గంటలకు స్వామివారి ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా విజయ గణపతి స్వామి కల్యాణం



పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని విజయ గణపతి స్వామి అష్టాదశ(18) వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సిద్ధి బుద్ధి సమేత విజయ గణపతి స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహం, పంచ గవ్యారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, విశేష హోమం తదితర కార్యక్రమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

రెండు ద్విచక్ర వాహనాల సీజ్

గుంటూరు ఈస్ట్: నెంబర్ ప్లేట్లు లేని రెండు ద్విచక్ర వాహనాలను పట్టాభిపురం పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం స్టేషన్ పరిధిలో గస్తీ నిర్వహించిన పోలీసులు నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న రెండు కేటీఎం బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

నేత్రపర్వంగా కూచిపూడి నృత్యాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పాత గుంటూరు: ఆదిత్య నగర్ ఒకటో లైనులోని సాయిరాం మందిరం 28వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని తిరుమల ఆర్ట్స్ అకాడమీ కళా రత్న డాక్టర్ మహంకాళి సూర్యనారాయణ శర్మ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారులు ఆర్.వైష్ణవి, రేష్మిత, జి.వైష్ణవి, అక్షయ, లిఖిత, నిర్విఘ్న, నందన, యశస్వి, శ్రియ, పద్మ, మోక్షిత గణపతి ప్రార్థన, బ్రహ్మాంజలిలు గోవిందా గోవిందా, పలుకే బంగారమాయెనా, నారాయణతే నమో నమో కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాన్ని మహంకాళి నాగలక్ష్మి, దేవస్థాన అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మూడున్నరేళ్లలో ముప్పై ఏళ్ల అభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



స్థానిక మహిళకు బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: రాష్ట్రంలో మూడున్నరేళ్లల్లో ముప్పైఏళ్ల అభివృద్ధిని చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. 21వ డివిజన్ 76వ సచివాలయ పరిధిలోని కృష్ణబాబుకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ ఆసుపత్రి వద్ద ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్పొరేటర్ కాండ్రుగుంట గురవయ్య అధ్యక్షత వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వస్తున్నాయా లేదా అని అడగ్గా, వస్తున్నాయని స్థానికులు తెలిపారు. అనంతరం లబ్ధిదారులు పొందిన పథకాల బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకుంటున్నామని అన్నారు. ఈ నూతన ఒరవడికి సీఎం వైఎస్‌జగన్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలలో ఎలా కోత విధించాలనే ఆలోచనతో పరిపాలన చేసిందని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను వెతికి మరి లబ్ది చేకూర్చుతుందని అన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లల్లో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాన్ని, అభివృద్ధి చేసి చూపించారని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ఒక యజ్ఞంలా జరుగుతుందన్నారు. ప్రజలందరి సంక్షేమం కోసం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కి లబ్ధిదారులు చల్లని దీవెనలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా పథకాలతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి అందిస్తున్నామని చెప్పారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి దేశంలోని పలు రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీలో మూడు వేల చికిత్సలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనలో జిల్లా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగి పనుల కోసం వేచి ఉండేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితుల్లేవని చెప్పారు. ఇళ్ల వద్దనే సచివాలయాలు అందుబాటులో ఉంచడంతో పనులు చకచకగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొండారెడ్డి నాగేశ్వరరెడ్డి, నాయకులు కె.రవీంద్రనాయక్, విజయ్, కాటం పవన్, బాబు, బంగారపు విజయకుమార్, గంపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యం రావాలి



జిల్లా శాఖ నూతన కార్యవర్గంతో కలిమిశ్రీ, రమణ యశస్వి, తదితరులు

పాత గుంటూరు: నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత సాహిత్య సంఘాలపై ఉందని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా శాఖ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ, ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రచయిత విడదల సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ పోటీల్లో బహుమతులు, ప్రభుత్వ పురస్కారాల కోసం రచయితలు రచనలు చేయకూడదన్నారు. సినీ గేయ రచయిత వేటూరి జయంతి, గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని విజయగోలి కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ జానీ బాష, ఉపాధ్యక్షులుగా కాకరపర్తి సుబ్రహ్మణ్యం, సభ్యులుగా విజయ గోలి, విష్ణు మొలకల భీమేశ్వరప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, కారంచేటి విజయకుమార్, కోట లీలాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధిగా బండికల్లు జమదగ్ని బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకటరమణ, రచయిత్రులు పోగుల విజయశ్రీ, సిహెచ్ సుశీలమ్మ, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మహిళ, ఆమె భర్తపై దాడి

గుంటూరు ఈస్ట్: ఓ మహిళపై పలువురు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్లలో నివసించే మాలే రోహిణి చిల్లర కొట్టు నడుపుతూ ఉంటుంది. ఆదివారం పాతకక్ష్యల నేపథ్యంలో సాంబశివరావు, గోపి, కోటయ్య మరికొందరు కర్రలతో వచ్చి రోహిణిని, ఆమె భర్తను తీవ్రంగా కొట్టారు. షాపు ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని పగలగొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గ్రాండ్ మ్యూజికల్ నైట్



పొత్తూరి రంగారావును సత్కరిస్తున్న దృశ్యం

పాత గుంటూరు: రాజాగారితోటలోని వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం, ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని ఆదివారం గ్రాండ్ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను అలరించింది. గాయకులు పలు చిత్రాల్లోని పాటలను ఆలపించారు. అనంతరం ప్రముఖ నటుడు నాయుడు గోపి, కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, డాక్టర్ నిమ్మల శేషయ్య, రచయిత పి.సూర్యనారాయణ, గాయకులు కె.రామ్‌దాస్‌కు ఎన్టీఆర్ సేవా పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నక్కా ఆనందబాబు, కన్నా మాష్టారు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షుడు దేవరకొండ బాలస్వామి, కార్యదర్శి కె.బాబూరావు పర్యవేక్షించారు.

కర్రసాములో విద్యార్థులకు పతకాలు



హనుమాన్ జంక్షన్‌లో జరిగిన కర్రసాము పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులు

పెదకాకాని: కర్రసాము పోటీలలో వెనిగండ్ల విద్యార్థులు పతకాల పంట పండిస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో కొంతకాలంగా కర్రసాము శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కుంగ్ ఫూ, కరాటే, చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు కర్రసాము మాస్టర్ ఖరీదు సాంబయ్య పర్యవేక్షణలో హాజరైన వెనిగండ్ల విద్యార్థులు పతకాలు సాధించారు. కొర్రపాటి చంద్రశేఖర్, పత్తి పవన్ కుమార్, షేక్ షాజు, కొండా దేవప్రణతి, వేల్పుల హేమంత్, ఖరీదు గీతామాధురి, కావ్యశ్రీ తదితరులు మొత్తం 23 పతకాలు సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నారు. నిర్వాహకుల చేతుల మీదుగా పతకాలతో పాటు సర్టిఫికెట్లు, ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకున్నారు. వాటిలో 20 గోల్డ్‌మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెడల్ ఉన్నాయి. ఈ సందర్భంగా సాంబయ్య(చంటి) మాట్లాడుతూ కర్రసాము నేర్చుకోవడం ద్వారా దేహదారుఢ్యం పెంచుకోవడంతోపాటు ఆత్మరక్షణ, చక్కని వ్యాయామంగా కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.